వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శనివారం, ఆగస్టు 08, 2026

# డైమండ్ కిడ్స్ ప్లే స్కూల్‌లో బోనాల సంబరాలు

- భక్తిశ్రద్ధలతో ఘనంగా బోనాల పండుగ..
- పోతురాజుల వీర నృత్యాలతో అలరించిన చిన్నారులు



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన అత్యంత వైభవవంతమైన బోనాల పండుగను డైమండ్ కిడ్స్ ప్లే స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు కలిసి పాఠశాల ప్రాంగణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ముఖద్వారం నుండి వేదిక వరకు రంగురంగుల ముగ్గులు, బంతిపూల తోరణాలు, మామిడి ఆకులు, వేప ఆకులతో ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ వేడుకల్లో సాంప్రదాయ దుస్తులు, నగలు ధరించిన విద్యార్థినులు, కుర్తా–పైజామా ధరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మట్టి కుండలకు పసుపు–కుంకుమలు అద్ది, వేపాకులతో అలంకరించి, వాటిపై జ్యోతులు వెలిగించి చిన్నారులు భక్తితో తలపై మోసుకుంటూ వేదిక వరకు చేరుకున్న దృశ్యాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఒంటి నిండా పసుపు, ముఖానికి కుంకుమ, కాళ్లకు గజ్జెలు కట్టి చేతిలో కొరడా పట్టిన విద్యార్థుల పోతురాజు వేషధారణ, లయబద్ధమైన డప్పు చప్పుళ్లకు అనుగుణంగా వారు చేసిన వీర నృత్యాలు ఈ వేడుకలకే తలమానికంగా నిలిచాయి. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి, పవిత్ర ప్రసాదాన్ని విద్యార్థిని విద్యార్థులకు పంచిపెట్టడంతో ఈ ఉత్సవం అత్యంత మంగళకరంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీదేవి, శ్రీనివాస్ రెడ్డితో పాటు ఉపాధ్యాయులు మంజుల, ఇందు, సుధ, హాసిని, సహస్ర, కళావతి, రాధిక, దుర్గ మరియు స్కూల్ ట్యూషన్ విద్యార్థులు భవ్య, విగ్నేష్, ఆర్యన్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు.





# రైస్ మిల్లు అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు వినోద్
- సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టించినా స్పందించని అధికారులు
- స్పందించకుంటే నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరిక




**రాజన్న సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** వేములవాడకు చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బండ మల్లేశం కుటుంబానికి చెందిన వి.ఆర్.ఆర్ రైస్ మిల్లులో వెలుగుచూసిన అక్రమాలపై ప్రభుత్వం, అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు వినోద్ నిలదీశారు. ఈ మేరకు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం మరియు అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ... వి.ఆర్.ఆర్ రైస్ మిల్లు యజమాని ప్రభుత్వానికి రూట్‌లోని 1232.773 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉందని, కానీ ఆ ధాన్యాన్ని పక్కదారి పట్టించారని ఆరోపించారు. అన్ని ఆధారాలతో సహా అక్రమాలు బయటపడినప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని, ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సంబంధిత బీజేపీ నాయకుడనే ఏకైక కారణంతోనే అధికారులు చర్యలకు వెనుకంజ వేస్తున్నారా? లేక అధికారులు, మిల్లు యజమానికి మధ్య ఏమైనా అంతర్గత ఒప్పందాలు ఉన్నాయా? అని నిలదీశారు. ఇన్ని అక్రమాలు జరుగుతున్నప్పటికీ అధికార కాంగ్రెస్ ప్రభుత్వం గానీ, స్థానిక నాయకులు గానీ స్పందించకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సీఎంఆర్ ధాన్యానికి సంబంధించిన సుమారు 4 కోట్ల రూపాయలను మిల్లు యజమాని నుండి తక్షణమే వసూలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే రైస్ మిల్లుపై, యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, అవసరమైతే నిరాహార దీక్ష కూడా నిర్వహిస్తామని హెచ్చరించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు రైతుల రక్తాన్ని పీల్చుతున్న రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైస్ మిల్లర్ల అవకతవకలపై నిరంతరం పోరాడుతామని, ఆరుగాలం శ్రమించే రైతన్నల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని వినోద్ స్పష్టం చేశారు.

# నేటి నుంచి శ్రీ ఉజ్జయినీ మహంకాళి జాతర

- వేములవాడలో బోనాల జాతర ప్రారంభం
- నాలుగు రోజుల పాటు వైభవంగా ఉత్సవాలు..
- ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించిన ఆలయ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పవిత్ర ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి అత్యంత వైభవంగా ప్రారంభంకానున్నాయి. నాలుగు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న ఈ జాతర మహోత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. జాతరలో భాగంగా తొలి రోజు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు. అనంతరం అమ్మవారు భక్తులకు దివ్యదర్శనమివ్వనున్నారు.రెండో రోజు వికాస తరంగిణి మహిళా బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక భక్తి పారాయణం, విశేష భక్తి భజన పాటలతో ఆరాధన కార్యక్రమాలు కొనసాగనున్నాయి. మూడో రోజు ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు ప్రత్యేకంగా శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. చివరి రోజు బుధవారం ఉదయం ఆలయంలో కొలువుదీరిన శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారితో పాటు శ్రీ మహాప్రత్యంగిర అమ్మవారు, శ్రీ భగళాముఖి అమ్మవార్లకు ఘనంగా పుష్పాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం అమ్మవార్లకు అత్యంత అరుదైన, మహిమాన్వితమైన ప్రత్యేక హోమం చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాట్లను సమన్వయంతో పర్యవేక్షిస్తున్నట్లు చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. నాలుగు రోజుల పాటు కన్నులపండువగా జరిగే ఈ అమ్మవారి బోనాల జాతర మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

